సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శిక్షణ తరగతులతో సామర్థ్యం పెంపు



మాట్లాడుతున్న ఎంఈవో అనురాధ

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ తరగతులు మూడు రోజు ల పాటు జరగనున్నాయి. చినగదిలి మండలంలో 72 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తరగతులను ప్రారంభించిన చినగదిలి మండల ఎంఈవో అనురాధ మాట్లాడుతూ అభ్యసనా సామర్థ్యం మెరుగుపరచడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నైపుణ్యం మెరుగుపరచుకోవడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రపంచ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి సిద్ధం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం భవానీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సరిత తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లింపు వివాదంలో కత్తితో దాడి

ఎంవీపీకాలనీ: అద్దె చెల్లింపు విషయంలో చిట్టుమూరి రాజు (28) అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్యం కూడలి జయభేరి దరి చైతన్య నగర్‌లో చిట్టిమూరి రాజు అతని స్నేహితులు నాని, వరుణ్ చాలా కాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల నాని అనారోగ్యంతో ఉన్న తన మామను చూసుకోవడం కోసం కాకినాడ వెళ్లాడు. ఆ సమయంలో మహేష్ అనే అతని స్నేహితుడిని ఆ అద్దె ఇంట్లో ఉంచాడు. అయితే ఇటీవల అద్దె చెల్లించే సమయంలో చిట్టిమూరి రాజు నానికి ఫోన్ చేసి అద్దె ఇవ్వాలని కోరాడు. తన స్థానంలో స్నేహితుడు మహేష్ ఉంటున్న నేపథ్యంలో అతని ద్వారా తన వంతు అద్దె సొమ్ము చెల్లించాలని నాని కోరాడు. మహేష్‌కు ఫోన్ చేసి అద్దె రాజుకు ఇవ్వాలని చెప్పాడు. అయితే మహేష్ అద్దె సొమ్ము చెల్లించకపోగా రాజుపై బెదిరింపులకు దిగాడు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన మహేష్ తనతో పాటు తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. రాజు ఛాతీతో పాటు మెడ ఎడమ భాగంలో కత్తితో పొడిచాడు. రాజు నుంచి రూ.600 లాక్కుని పరారయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో రాజుని ఆస్పత్రికి తరలించారు. చిట్టిమూరి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు.

ఆది మహోత్సవ్‌లో గిరిజన ఉత్పత్తులు



గిరిజన ఉత్పత్తుల స్టాల్ వద్ద జీసీసీ ఎండీ కల్పనా కుమారి

ఏయూక్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఆది మహోత్సవ్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 16న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఆదిమ మహోత్సవ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జీసీసీకి సంబంధించిన స్టాల్‌ను ఏర్పాటు చేసి, జీసీసీ ఉత్పత్తులను ఉంచారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆదివాసీ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారు. గిరిజన సంక్షేమానికి తోడ్పాటును అందించే విధంగా జీసీసీ ఈ కార్యక్రమంలో భాగమైందని జీసీసీ ఎండీ కల్పనా కుమారి తెలిపారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికేకి గిరిజన ఉత్పత్తులను బహూకరించి, వాటి ప్రత్యేకతలను వివరించారు.

సిటీ పోలీస్‌పై గాజువాక గ్రీన్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్ పోటీల్లో సిటీ పోలీస్‌పై 106 పరుగుల తేడాతో గాజువాక గ్రీన్స్ విజయం సాధించింది. రైల్వేస్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కౌంటీ సీసీ జట్టు 8 వికెట్లకు 111 పరుగులు చేసింది. ప్రతిగా గెలాక్సీ సీసీ ఆరు వికెట్లు కోల్పోయి 17.2 ఓవర్లలోనే విజయాన్నందుకుంది. జింక్‌గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ ఏడు వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. ప్రతి గా సిటీ పోలీస్ 83 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో విజయనగరం జట్టు 40 పరుగుల తేడాతో యలమంచిలి సీసీపై విజయం సాధించింది.వరుసగా ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గాజువాక గ్రీన్స్, విజయనగరం జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- నిర్మాణం పూర్తయి నెలలు.. సంవత్సరాలు గడిచినా వినియోగించని అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రైతుబజార్, షాపింగ్ కాంప్లెక్స్, జీవీఎంసీ భవనం, రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రం



రూ.కోట్లు వృథా.. ఎన్నాళ్లీ వృథా?

ఆరిలోవ కాలనీలో వినియోగంలో లేని షాపింగ్ కాంప్లెక్స్



ముడసర్లోవ వద్ద నిరుపయోగంగా మిగిలిన జీవీఎంసీ భవనం



పెదవాల్తేరులో నిర్మించి వదిలేసిన రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రం

ఆరిలోవ: నియోజకవర్గంలో పలు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. జోన్–2, 3 పరిధిలో కొన్ని రూ. కోట్ల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. అన్ని హంగులు ఉన్నా వాటిని అధికారులు వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. జోన్–2లోని 10వ వార్డు పరిధి తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని నిర్మించిన రైతు బజార్, జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో నిర్మాణం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్, ఇదే వార్డు పరిధి ముడసర్లోవ వద్ద నిర్మించిన జీవీఎంసీ భవనం (స్కిల్ డెవలప్‌మెంట్ భవనం), జోన్–3 పరిధి 20వ వార్డు పెదవాల్తేరులో రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రం, ఈ వార్డులోనే ఉన్న మెంటల్ కేర్ ఎక్స్‌లెన్స్ సెంటర్ తదితర భవనాలను సంబంధిత అధికారులు వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో నిరుపయోగంగా మిగిలాయి.

ప్రారంభానికి నోచుకోని షాపింగ్ కాంప్లెక్స్..

ఆరిలోవ కాలనీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా గెడ్డ అంచున జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి సుమారు ఆరేళ్లు గడిచింది. ఇక్కడ సుమారు రూ. 45 లక్షలతో దుకాణ సముదాయం నిర్మించారు. ఇక్కడ కూరగాయలు, చికెన్, మటన్ షాపులతో పాటు ఫిష్ మార్కెట్‌కు సంబంధించిన వ్యాపారులు కూడా షాపులు నిర్వహించుకోవచ్చని అప్పట్లో జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఈ షాపుల నిర్మాణం పూర్తయి ఆరేళ్లు గడిచిపోయింది. ఇంత వరకు అధికారులు వాటిని వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో ఈ షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఈ దుకాణ సముదాయాన్ని మార్చుకున్నారు. దీనికి సమీపంలోనే మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులు దీన్ని ఓపెన్ బార్‌గా మార్చేశారు. మద్యం దుకాణంలో కొనుగోలు చేసిన మందు తీసుకొచ్చి ఇక్కడ దర్జాగా తాగి ఊగుతున్నారు. మరికొందరు రాత్రిళ్లు అసభ్యకర వ్యవహారాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా రూ.6 కోట్ల భవనం..

జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ వద్ద జీవీఎంసీ నిర్మించిన విశాలమైన భవనం ఉపయోగంలో లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. **జీవీఎంసీ సుమారు 11 సంవత్సరాల క్రితం ఓ భవనం నిర్మించింది. ఇక్కడ బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని జీవీఎంసీకి చెందిన 2 ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్ల నిధులు కేటాయించి ఆగమేఘాలపై పనులు జరిపారు. 2013 నాటికి భవన నిర్మాణం పూర్తి చేశారు. మూడు అంతస్తుల్లో విశాల**మైన గదులతో మంచి గాలి, వెలుతురు వచ్చేటట్లు దీన్ని నిర్మించారు. జోన్–2 జోనల్ కార్యాలయం కోసం అధికారులు ఈ భవనాన్ని నిర్మించారు. అయితే అధికారులు హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహణ కోసం లీజుకు ఇచ్చేశారు. సుమారు పదేళ్లు నిర్వహించిన అనంతరం హెచ్‌పీసీఎల్ సంస్థ ఈ భవనాన్ని 2023 నవంబర్‌లో ఖాళీ చేసింది. ప్రస్తుతం దీన్ని అధికారులు ఏ కార్యకలాపాలకూ వినియోగించడంలేదు. దీంతో ఏడాదికి పైగా ఈ భవనం నిరుపయోగంగా మిగిలిపోయింది. ప్రస్తుతం ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

ప్రధాని ప్రారంభించినా..

జీవీఎంసీ 20వ వార్డు పరిధి పెదవాల్తేరులో సుమారు రూ.50 కోట్లతో నిర్మించిన రెండు భవనాలు ఏడాది కాలంగా నిరుపయోగంగా మిగిలాయి. రూ.20 కోట్లతో నిర్మించిన ఈ భవనంలో రాష్ట్ర ఆహార పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆశించారు. 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో దీన్ని ప్రారంభించారు. **అప్పటి నుంచి** ఇంత వరకు ఈ **భవనాన్ని అధికారులు వినియోగంలోకి** తీసుకురాలేదు. దీంతో ఏడాదిగా ఈ నిర్మాణం నిరుపయోగంగా మిగిలిపోయింది. ఇదే వార్డు పరిధి దీనికి సమీపంలో మెంటల్ ఆస్పత్రి ఆవరణలో సుమారు రూ.30 కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన మెంటల్ కేర్ ఎక్స్‌లెన్స్ సెంటర్ పరిస్థితి అంతే. దీన్ని నిర్మించి ఏడాది గడిచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ భవన ప్రారంభోత్సవ తేదీలను అధికారులు మూడుసార్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు కాని.. ప్రారంభోత్సవం అయితే జరగలేదు. ఏడాదిగా నిరుపయోగంగానే పడి ఉంది.

నిరుపయోగంగా రైతుబజార్..

ఆరిలోవ ప్రాంతానికి ఎన్నో ఏళ్లుగా తీరని కలగా మిగిలిపోయిన రైతుబజార్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించారు. దీని కోసం మార్కెటింగ్ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదగదిలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు మధ్యలో సుమారు అరెకరం స్థలంలో ఈ రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇది పూర్తయి ఆరు నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో దీని ఆవరణలో పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. ఇక్కడి షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకు కూరలు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణా షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మేన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు.



తోటగరువు హైస్కూల్ వెనుక నిరుపయోగంగా మిగిలిన రైతుబజార్

ప్రజాధనం వృథా..

అధికారులు ప్రజా ధనంతో భవనాలు నిర్మించి వినియోగించడంలేదు. దీంతో కోట్లాది నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ఇది మంచి పద్ధతి కాదు. భారీ వ్యయంతో నిర్మించిన భవనాలను వదిలేయడంతో అవి శిథిలమవుతున్నాయి. కొన్నింటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి.

– ఎస్.రామారావు, చినగదిలి

నిర్మించి వదిలేస్తున్నారు

ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రజల సేవలకు వినియోగించాలి. అయితే అలా జరగడంలేదు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కట్టడాలను నిరుపయోగంగా వదిలేస్తుండడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రజాధనంతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– కె.వరహాలు, పెదగదిలి

పోక్సో కేసుల్లో రాజీ కుదర్చకూడదు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ
- తోటగరువులో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ

ఆరిలోవ: పోక్సో కేసుల్లో రాజీ కుదర్చడానికి ఎవరూ ప్రయత్నించకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో తోటగరువు దరి ఎర్రిదుర్గమాంబ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి పోక్సో చట్టం అమలులో ఉందన్నారు. ఈ చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. పోక్సో నేరాలు జరిగినప్పుడు మధ్యవర్తులు, పెద్దమనుషులుగా చలామణి అవుతున్నవారు రాజీ కుదర్చడానికి ప్రయత్నించకూడదని తెలిపారు. అలాంటి ప్రయత్నాలు చేసేవారు కూడా నేరంలో భాగస్వాములు అవుతారన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలు, పెద్దలు అశ్లీల వీడియోలు చూడకూడదన్నారు. అలాంటి వీడియోలు చూడటం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీసీపీ వి.బి రాజ్‌కుమార్, ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు, ఎస్ఐలు రామ్‌దాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్థలం పరిశీలన



రైల్వే స్థలాన్ని పరిశీలిస్తున్న మురళీ పరశురామరాజు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో రైల్వే జోన్ కోసం కేటాయించిన స్థలానికి కొద్ది రోజులుగా భూ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మురళీ పరశురామరాజు మంగళవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ భూమి అనుకూలమైనదన్నారు. రైల్వే జోన్ కోసం ప్రభుత్వం 54 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. రైల్వే జోన్ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించకుండా కాలయాపన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థలం కేటాయించిందన్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌ను సందర్శించిన అధికారులు



స్టాల్‌లో కూరగాయలు పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్



రైతు గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న సెక్రటరీ పాపారావు

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ, విజిలెన్స్ విభాగం అధికారులు మంగళవారం సందర్శించారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి షేక్ యాసిన్, కమిటీ సెక్రటరీలు పాపారావు, అరుణ ఇక్కడ రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, వ్యాపారులు నిర్వహిస్తున్న స్టాళ్లను పరిశీలించారు. ఆయా షాపుల్లో తాజా కూరగాయాలు విక్రయిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రైతుల గుర్తింపు కార్డులు పరిశీలించారు. రైతులు తమకు కేటాయించిన స్టాళ్లు నిర్వహిస్తున్నారా, వేరే వ్యక్తులు నిర్వహిస్తున్నారా, స్టాళ్ల వద్ద ధరల పట్టీ బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై తెలుసుకున్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర వస్తుందా లేదా, పొలం వద్ద విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర వస్తుందా, రైతు బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తే గిట్టుబాటు ధర వస్తుందా అనేదానిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య స్టాళ్లు నిర్వహిస్తున్న వారు ప్రతి నెలా సకాలంలో అద్దె చెల్లింపు గురించి రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ యాసిన్ మాట్లాడుతూ ప్రతి రైతు తాము పండించిన కూరగాయలను రైతు బజార్‌లో విక్రయించాలన్నారు. అనంతరం రైతు బజార్‌కు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో రైతు బజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ప్రసన్నశ్రీ నియామకంపై హర్షం

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ప్రసన్నశ్రీని ఆదికవి నన్నయ వర్సిటీ వీసీగా నియమించడంపై రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహాయ ఆచార్యుడు (కాంట్రాక్ట్) మధుకుమార్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తొలిసారి ఆదివాసీ మహిళను వీసీగా నియమించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీయుల అభ్యున్నతికి, ఉన్నత విద్యాబోధనకు ఆచార్య ప్రసన్న శ్రీ చేసిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు కృషి

సీతంపేట: బహుజన్ సమాజ్ పార్టీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పెదపెంకి శివప్రసాదరావు పరిచయ కార్యక్రమం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. బహుజన్ సమాజ్ పార్టీ జోనల్ కన్వీనర్ లకే రాజారావు ఎమ్మెల్సీ అభ్యర్థిని పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేసి, ఐదేళ్ల సర్వీస్ ఉండగానే ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పెదపెంకి శివప్రసాదరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసాదరావు మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసే జీవోను అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు, సర్వే సురేష్, భీమరశెట్టి విశ్వనాథం, దాసరి సూర్యనారాయణ, రమేష్, రమణ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు



ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి విక్టరీ సింబల్ చూపిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

డీఈవో ప్రేమ్‌కుమార్

పెదగంట్యాడ: ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు వస్తాయని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులతో సంభాషించారు. ప్రతి ఒక్కరూ బాగా చదవాలని, మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే దానికి చదువే ముఖ్య కారణమన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించేలా శ్రద్ధతో చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోందని, విద్యార్థులు ఆందోళనకు లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారు కూడా చదువులో ముందుండేలా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాలయం వీధి పెదజాలరిపేటకి చెందిన చల్లా రూపశ్రీ (17) అదృశ్యంపై పోలీసు కేసు నమోదు చేశారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదజాలరిపేటకి చెందిన చల్లా రాజు పెద్ద కుమార్తె రూపశ్రీ ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. రోజూ మాదిరిగానే 17వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కళాశాలలో వాకబు చేయగా ఆమె కళాశాలకు రాలేదని తెలిసింది. యువతి స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి రాజు మంగళవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వేద విజ్ఞానం మానవాళికి మార్గదర్శకం



మహా గణపతికి నమస్కరిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ



పూజల్లో పాల్గొని, ప్రవచనం వింటున్న భక్తులు

ఎంవీపీకాలనీ: సనాతన భారతీయ మహా ఋషులు అందించిన పురాణ, ఇతిహాస, వేదాల విజ్ఞానం మానవాళి మనుగడకు మార్గదర్శకమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగ శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్క్ వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో శ్రీ మహా గణపతి వైభవంపై మంగళవారం ఆయన అనుగ్రహభాషణం చేశారు. వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని విశదీకరించారు. ఋషులు అందించిన ఈ విజ్ఞానాన్ని ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాల ద్వారా ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం భక్తులతో మహా గణపతి మంత్రాలను చెప్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేవీఎస్ శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వీవీ ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీశ్వరుని ఊరేగింపు



ప్రత్యేక రథంపై పార్వతీశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో జరుగుతున్న పార్వతీశ్వరుని 35వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం సారెతో స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహిళలు సారెతో వెంటరాగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం



పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం చేస్తామని, సొంత నిధులతోనే పోర్టు హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 142వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న పోర్టు, అందులో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్యంతో వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దీంట్లో నాలుగోవంతు ఖర్చుపెట్టినా ఈ హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్స్, సిబ్బందిని నియమించవచ్చని, ఈ రకంగా ఆలోచించకుండా ప్రైవేటు వాళ్లకి ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం జరిగిన దీక్షలో సత్యనారాయణ, ఎస్.సాధుబాబు, జీసీహెచ్‌వై నాయుడు, రాజగోపాలరావు, సీహెచ్‌వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.